క్లుప్తంగా

పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని సైదాపూర్ క్రాస్ వద్ద మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటుపై పీవీ సేవా సమితి నాయకులు శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోట రాజేంద్ర ప్రసాద్, అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.మనోజ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం దీక్షలు



మాట్లాడుతున్న శంకర్

హుజూరాబాద్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈనెల 21, 22వ తేదీల్లో జిల్లావ్యాప్తంగా అన్ని ఎంపీడీవో కార్యాలయాల ఎదుట దీక్షలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని చెల్పూర్‌లో మాట్లాడారు. వేతనాలు అందక పంచాయతీ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గుగ్గిళ్ల రాములు, శనిగరపు కొముర‌య్య, తిరుపతి, అవినాష్, మనక్క, సరోజన, పోచక్క, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటర్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఓదెలు

హుజూరాబాద్: కలెక్టర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరగనున్న నేపథ్యంలో ఆ రోజు ఎస్సీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల ఓదెలు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు, పంచరాయి భూములు, తదితర సమస్యల పరిష్కారం కోసం మార్గం చూపాలని కోరారు. నాయకులు రామగిరి అంకుష్, అంతడుపుల బాబు, తునికి లింగయ్య, సారయ్య, కోడూరి సమ్మయ్య తదితరులు ఉన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభ విజయవంతం చేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

జమ్మికుంట: ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 14న నిర్వహించే జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభను వియవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణాప్రతాప్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని డిగ్రీ కళాశాల బాలికల వసతి గృహంలో జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు విద్య, వైద్యం, ఉపాధి అందించాలని, సమసమాజం స్థాపించాలని జార్జిరెడ్డి పోరాటం చేశారని కొనియాడారు. విద్యార్థి సంఘం ఎన్నికల్లో జార్జిరెడ్డి స్థాపించిన పీడీఎస్ గెలవడాన్ని జీర్ణించుకోలేని కొందరు కత్తులతో దాడి చేసి హతమార్చారన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై పోరాడి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కెంసారపు రవితేజ, నాయకులు కొయ్యడ బాబు, ఎండీ అస్లాం, శ్రీజ, అనుష, స్వప్న, రవళి పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతు

సాక్షి స్పందన

రామడుగు: మండలంలోని వెలిచాలకు వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి వద్ద భగీరథ పైపులైన్ లీకేజీకి అధికారులు మరమ్మతు చేశారు. పైపులైన్ లీకేజీతో రహదారిపైకి నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్న విషయం 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా, అధికారులు స్పందించారు. లీకేజీ కాకుండా మరమ్మతు చేయడంతో గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

చీరలు పంపిణీ

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం రెండోవార్డులో మాజీ కౌన్సిలర్ మరెపల్లి బిక్షపతి తల్లితండులు లక్ష్మికొమురయ్య జ్ఞాపకార్థం వార్డులోని ఆర్యవైశ్య నాయకులు ఎలిమిల్ల ప్రసాద్ చేతుల మీదుగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ పిట్టల శ్వేత రమేశ్, కొత్తూరి రమేశ్, మారెపల్లి రామస్వామి, బుర్ర స్వామి, సంపత్, ముద్దమల్ల రవీందర్, పోతుల శ్రీనివాస్, ఇంజపెల్లి రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలం.. పునాదులకే పరిమితం

ఇల్లందకుంట: గ్రామపాలనకు ముఖ్యమైన పంచాయతీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్నింటికి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, మంజూరైన వాటికి నిర్మాణాలు పూర్తికాక పునాదుల వద్దే పనులు ఆగిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లందకుంట మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో రాచపల్లి, చిన్నకోమిటిపల్లి గ్రామ పంచాయతీ భవనాలు ఎప్పుడు కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ అధికారులు పాలన సాగిస్తున్నారు. రెండు పంచాయతీల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వంతడ్పుల పంచాయతీ కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కొత్త భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



'ఈచిత్రంలో ఉన్నది చిన్నకోమటిపల్లి పంచాయతీ భవనం. కూలిపోయే దశకు చేరింది. ఎలాంటి సౌకర్యాలు లేని చిన్న ఇరుకైన రూమ్‌లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. సమావేశాలు నిర్వహించాలంటే ఆరుబయట కూర్చోవలసిందే. భవనం కూలిపోయే దశలో ప్రమాదకరంగా ఉంది.



'ఇది రాచపల్లి పంచాయతీ కార్యాలయం. ఈ భవనాన్ని నిర్మించి సుమారు 50 ఏళ్ల అవుతోంది. పురాతన భవనం కావడంతో పగుళ్ల ఏర్పడ్డాయి. వర్షాకాలంలో స్లాబు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతంలో ఇక్కడ నూతన భవనానికి ఉపాధి హామీ నిధులు రూ.16 లక్షలు మంజూరయ్యాయి. వాటితో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మిస్తారని గ్రామస్తులు సంతోషించగా, పునాదుల వద్దే పనులు నిలిచిపోయాయి'.



'ఈ ఫొటోలో ఉన్నది వంతడ్పుల గ్రామపంచాయతీ కార్యాలయం. సొంత భవనం శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్ల నుంచి నెలకు రూ.1,000 అద్దె చెల్లిస్తూ ఇరుకైన భవనంలో నిర్వహిస్తున్నారు. సమావేశాల నిర్వహణకు ఇక్కట్లు తప్పడం లేదు. కొత్త భవనం నిర్మాణం కోసం గతంలో రూ.13 లక్షల నిధులు మంజూరు కాగా, అవి సరిపోవనే కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాక, పనులు ప్రారంభం కాలేదు. మరిన్ని నిధుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండాపోయింది'.

- అద్దె భవనం.. అరకొర వసతులు
- గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సౌకర్యాల లేమి
- నిధులు లేక నిలిచిన కొత్త భవనాల పనులు
- పునాదులకే పరిమితమైన వైనం



'ఈ ఫొటోలోని పిల్లర్లు చిన్నకోమటిపల్లి నూతన గ్రామపంచాయతీ భవనానికి సంబంధించినవి. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మాణ పనులు చేపట్టగా నిధులు లేమితో పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి'.

నిధులు మంజూరు చేయాలి



రాచపల్లిలో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే దశలో ఉంది. కొత్త పంచాయతీ భవన నిర్మాణం నిధుల లేమితో పునాదుల వద్దే ఆగిపోయింది. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలి.

– రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్, రాచపల్లి

సొంత భవనాలు లేక ఇబ్బంది



పంచాయతీలకు సొంత భవనాలు లేక పాలన ఇబ్బందిగా మారింది. రాచపల్లి, చిన్నకోమిటిపల్లి పంచాయతీల నిర్మాణం నిధులు లేక నిలిచిపోయింది. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

– రాము, సీపీఎం మండల కార్యదర్శి, ఇల్లందకుంట

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



జమ్మికుంట: పరిరక్షణ యాత్రలో నాయకులు



శంకరపట్నం: పాదయాత్రలో నాయకులు

శంకరపట్నం/గన్నేరువరం/జమ్మికుంట: శంకరపట్నం మండలం ధర్మారం, కన్నాపూర్, గద్దపాక, కాచాపూర్, కల్వల, అంబేడ్కర్‌నగర్ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీం, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బస్వయ్య తదితరులు పాల్గొన్నారు. గన్నేరువరం మండలం జంగపల్లి, గోపాల్‌పూర్, హన్మాజిపల్లె గ్రామాల్లో మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పార్టీ జెండా ఎగురవేశారు. జమ్మికుంట పట్టణంలోని 9,10,11,12,24వ వార్డుల్లో పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగాన్ని కాపాడే శక్తి కాంగ్రెస్‌కే ఉందని ప్రజలకు వివరించారు. టీపీసీసీ మెంబర్ సాయిని రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, మహిళ అధ్యక్షురాలు పూదరి రేణుక పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



శ్రీనివాస్

చొప్పదండి: అంబేడ్కర్ యువజన సంఘం పట్టణ శాఖ నూతన అధ్యక్షుడిగా వడ్లూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి చింటు, ఉపాధ్యక్షులు కనకం శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సోమిడి అభిషేక్, కొత్తూరి ప్రేమ్‌కుమార్, దీకొండ హరీశ్, ఇరుగురాల భూమేశ్, కొత్తూరి నరేందర్, పెద్దెల్లి అనిల్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శి కల్లెపల్లి అనిల్‌కుమార్, కోశాధికారి కొత్తూరి దినేశ్, ప్రచార కార్యదర్శి పెద్దెల్లి జగదీశ్, కల్లెపల్లి ఉదయ్, కల్లెపల్లి రిషి, పోగుల రాజు ఎన్నికయ్యారు.



హుజూరాబాద్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాడి



రామడుగు: పూజలు చేస్తున్న నరేందర్‌రెడ్డి



చిగురుమామిడి: కరపత్రం ఆవిష్కరణ

జై బోలో హనుమాన్‌కీ..

హుజూరాబాద్/రామడుగు/చిగురుమామిడి: హనుమాన్ చిన్న జయంతిని పురస్కరించుకొని శనివారం అంజన్న ఆలయాల్లో రద్దీ నెలకొంది. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట హనుమాన్ ఆలయంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. చిగురుమామిడి శివారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆగమశాస్త్ర పండితులు శ్రీమాన్ శ్రీనమిలికొండ రమణాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. మే 21 నుంచి జరిగే ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన కరపత్రం ఆవిష్కరించారు.

శకటోత్సవం



ఎడ్లబండ్ల పోటీల్లో భక్తులు

గన్నేరువరం: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శకటోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ వాహనాలు, ఎడ్ల బండ్లను తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు.

రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

చొప్పదండి: శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని కాట్నపల్లిలో శనివారం స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపు నిర్వహించగా భక్తులు స్వామివారికి స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం చేశారు.



ఆలయ నిర్మాణానికి పూజలు

గన్నేరువరం: మండలంలోని మైలారంలో శనివారం ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అలాగే గుట్ట చుట్టూ శ్రీగిరి ప్రదక్షిణకు సంబంధించి పనులు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాలు

గంగాధర: మండలంలోని కొట్లనర్సింహులపల్లి లక్ష్మీనర్సింహ, అన్నపూర్ణ విశ్వనాథాలయంలో లక్ష్మీనర్సింహస్వామి జాతరలో భాగంగా శనివారం ఒకే వేదికపై లక్ష్మీనర్సింహస్వామి, సీతారామస్వామి, వేంకటేశ్వరస్వామి, గోదా రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు తరలివచ్చి స్వామివారలకు మొక్కులు చెల్లించుకున్నారు.



రామడుగు: రామడుగు మండలం వెలిచాల నుంచి గుడ్డివెలుగులపల్లెకు వెళ్లే రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. లీకేజీతో నీళ్లు మురికిగా మారి మళ్లీ పైపులైన్‌లోకి వెళ్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శారోన్, ఏఈ, మిషన్‌భగీరథ, రామడుగు సెల్ : 63099 54418

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభం



కరీంనగర్: నగరంలో బీఆర్‌ఎస్ నూతన జిల్లా కార్యాలయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రవిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ఇల్లందకుంట: అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం జమ్మికుంట జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల 1983–84వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ (బాల్యమిత్రులసేవా సమితి) ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, బాల్యమిత్రులు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో సుధాకర్, బాల్యమిత్రుల సేవా సమితి అధ్యక్షుడు మొకిరాల సంపత్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ విజయ, ఆలయ చైర్మన్ రామారావు

జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని కృష్ణకాలనీలో బాల వికాస సభ్యులు రమ, మారెపల్లి లక్ష్మి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల అజయ్‌గౌడ్, మైస మహేందర్, దొడ్డె నవీన్ ప్రారంభించారు. బాల వికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసమే పథకాలు



జమ్మికుంట: పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట/మానకొండూర్‌రూరల్: దేశంలో పేదల అభివృద్ధి కోసం బీజేపీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామిడి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మడిపల్లిలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు నాగపూరి విక్రమ్, ఎగ్గెటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో మండల మాజీ అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. నాయకులు హరీశ్, కరుణాకర్, సురేశ్, దుర్గయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రంగోలి, క్విజ్ పోటీలు

కరీంనగర్‌సిటీ: మహనీయుల జయంతి పురస్కరించుకొని శాతవాహన విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో శనివారం రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం వీసీ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్ రవికుమార్‌జాస్తీలు పోటీలను ప్రారంభించి బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిబా పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ మహాత్ములను స్మరించుకోవడమే వారికిచ్చే గౌరవమని, వారి ఆశయాల ను కొనసాగించాలని అన్నారు. రవికుమార్‌జాస్తి మాట్లాడుతూ ప్రజలను చైతన్యపర్చడం, మహిళల అభ్యుదయం కోసం మహనీయులు పాటుపడ్డారని తెలిపారు. మహనీయుల జయంతి ఉత్సవాల కన్వీనర్లు మనోహర్, ఓఎస్‌టీ టు వీసీ హరికాంత్, ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సుజాత, జయంతి, శ్రీశైలం, శ్రీవాణి, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీరామ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు డాక్టర్ శ్రీకర్ తెలిపారు. ఆర్కే హాస్పిటల్, శరత్ మాక్స్‌విజన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 58 రకాల రూ.5వేల విలువగల టెస్టులను కేవలం రూ.999 నిర్వహించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తి కోసం గాలింపు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఓ వ్యక్తి మార్చి 22న మోటార్‌సైకిల్‌తో ఢీకొట్టి పరారయ్యాడు. సదరు వ్యక్తి సీసీ ఫుటేజీలను శనివారం పోలీసులు విడుదల చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.